సాక్షి ఖమ్మం
శనివారం ౹ 12 ౹ జూలై ౹ 2025



ఎరువు.. కృత్రిమ కరువు
జిల్లాకు కేటాయించిన మేర ఎరువుల కోటా చేరకపోవడాన్ని అదునుగా చేసుకున్న కొందరు డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. 8లో



వసూళ్ల దందా
సత్తుపల్లి ఎంవీఐ కార్యాలయ ఉద్యోగులు వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33°/26°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

అకాడమీల్లో ప్రవేశానికి 15, 16వ తేదీల్లో పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆధ్వర్యాన గచ్చిబౌలి, ఎల్.బీ. స్టేడియంల్లో కొనసాగుతున్న క్రీడా అకాడమీల్లో ప్రవేశానికి ఈనెల 15, 16వ తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలోని హాకీ అకాడమీలో బాలబాలికలకు, ఎల్.బీ. స్టేడియంలోని హ్యాండ్‌బాల్ అకాడమీలో బాలబాలికలకు, ఫుట్‌బాల్ అకాడమీలో బాలురకు ప్రవేశాలు ఉంటాయని వెల్లడించారు. 12–16 ఏళ్లలోపు వారికి అవకాశం ఉండగా, జాతీయస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు, స్పోర్ట్స్ ఫెడరేషన్ టోర్నీల్లో పాల్గొన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సర్టిఫికెట్లతో స్టేడియంల్లో సంప్రదించాలని డీవైఎస్‌ఓ ఓ ప్రకటనలో సూచించారు.

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నరేందర్



ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం సహకారనగర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.నరేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు సూపరింటెండెంట్‌గా వచ్చారు. ఈమేరకు ప్రస్తుత సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించగా, వైద్యులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ నరేందర్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



పాఠశాలలో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ దీక్ష

బోనకల్: ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో పిల్లలను పంపించే తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షా రైనా సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసిన ఆమె 10వ తరగతి విద్యార్థుల హాజరు, బోధనపై ఆరా తీయడమే కాక సైన్స్, గణితం ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసిన ఆమె మెనూ అమలుపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం వడ్డించడమే కాక పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆతర్వాత వనమహోత్సవంలో భాగంగా మొక్క నాటిన సీఈఓ, కూరగాయల మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే–డ్రైడే అమలును పర్యవేక్షించారు. ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రీ, పంచాయతీ కార్యదర్శి సైదులు, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆస్పత్రులకు కాయకల్ప అవార్డు



తిరుమలాయపాలెం ఆస్పత్రి

తిరుమలాయపాలెం/పెనుబల్లి: జిల్లాలోని తిరుమలాయపాలెం, పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు కాయకల్ప అవార్డు లభించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ రాష్ట్రవ్యాప్తంగా అవార్డులకు ఎంపికైన ఆస్పత్రుల జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో తిరుమలాయపాలెం ఆస్పత్రి 84.15 పాయింట్లతో అవార్డు కింద రూ.లక్ష రికార్డుకు ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు ఆస్పత్రులను పరిశీలించి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, వైద్యసేవలపై ఆరా తీశారు. అన్ని అంశాల్లో మెరుగైన పనితీరు కనబర్చడంతో రెండు ఆస్పత్రులను అవార్డులకు ఎంపిక చేశారు. కాగా, అవార్డు తమపై బాధ్యతను పెంచిందని తిరుమలాయపాలెం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృపా ఉషశ్రీ తెలిపారు. అలాగే, పెనుబల్లి ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అభినందించారు.

కాంగి'రేస్'లో ఎవరెవరో?!



- 'స్థానిక' ఎన్నికల నేపథ్యాన అధికార పార్టీలో పదవుల పందేరం
- బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతంపై నజర్
- మండల, జిల్లా కమిటీల నియామకంపై కసరత్తు
- రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీకీ ప్రతిపాదనలు

కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది. ఈనేపథ్యాన ఉమ్మడి జిల్లాలో బూత్ స్థాయి నుంచి డీసీసీ వరకు పదవుల భర్తీకి కసరత్తు మొదలుపెట్టారు. అలాగే, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్లు, సభ్యుల నియామకానికి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. త్వరలోనే గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యాన అన్ని స్థాయిల్లో పటిష్టమైన నిర్మాణం ఉండాలనే ఉద్దేశంతో నియామకాలకు శ్రీకారం చుట్టారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఏడేళ్ల తర్వాత..

ఏడేళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలో సంస్థాగతంగా పదవుల భర్తీపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టింది. చివరిగా 2018లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కమిటీలను నియమించారు. ఆ తర్వాత కొందరు మండల అధ్యక్షులు పార్టీ మారగా.. ఇంకొందరు స్తబ్దుగా ఉంటున్నారు. ఇలాంటి స్థానాల్లో ఇన్‌చార్జిలను మాత్రమే నియమించారు. చాలాచోట్ల గ్రామ, బూత్ స్థాయి కమిటీల పరిస్థితి కూడా అలాగే ఉంది. దీంతో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కమిటీల భర్తీకి ఉపక్రమించారు.

కసరత్తు షురూ..

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సంస్థాగత పదవుల భర్తీ ప్రక్రియను కాంగ్రెస్ ప్రారంభించింది. ఇందుకోసం ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన రెండు రోజులుగా మండల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యుల నియామకానికి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షుల కోసం ఇద్దరికి తగ్గకుండా పేర్లు స్వీకరిస్తున్నారు. ఆ మండల నేతల నుంచి పేర్లు సేకరిస్తూనే, వ్యక్తిగతంగా ఇచ్చే వారి దరఖాస్తులు కూడా తీసుకుంటున్నారు. అలాగే రాష్ట్రస్థాయి కార్పొరేషన్, ప్రభుత్వ బోర్డుల డైరెక్టర్లు, సభ్యుల నియామకానికి నియోజకవర్గానికి ఇద్దరి పేర్లు సేకరిస్తున్నారు.

15లోగా మండల, జిల్లా కమిటీల ప్రతిపాదనలు

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి పాటుపడిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు ఇచ్చేలా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. ఇందుకోసం పార్టీ కమిటీల్లో చోటు కల్పించేందుకు జిల్లా ఇన్‌చార్జి వంశీచంద్‌రెడ్డి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. శనివారంలోగా రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులకు పేర్లను టీపీసీసీ అధ్యక్షుడికి పంపిస్తారు. అలాగే, 15లోగా మండల కాంగ్రెస్, జిల్లా కమిటీ సభ్యుల నియామకాలకు సేకరించిన పేర్లు అందజేయనున్నారు. కాగా, జిల్లా కమిటీ, నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఆశావహుల వివరాలపై శుక్రవారం ఖమ్మం, భద్రాద్రి డీసీసీ అధ్యక్షులు, నేతలు పోట్ల నాగేశ్వరరావు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఇన్‌చార్జిలతో వంశీచంద్ సమావేశమయ్యారు. అలాగే ఖమ్మం నగర కమిటీపైనా చర్చించారు. అయితే, డీసీసీ అధ్యక్షుడి నియామకానికి మరింత సమయం పట్టనుంది.

అంతటా హడావుడి

సుదీర్ఘకాలం తర్వాత కమిటీల నియామకం జరుగుతుండడంతో పార్టీ శ్రేణుల్లో హడావుడి మొదలైంది. కొన్నేళ్లుగా కాంగ్రెస్‌నే అంటి పెట్టుకుని ఉన్న వారు పదవుల కోసం నేతలను అభ్యర్థిస్తున్నారు. ఓవైపు మండల, జిల్లా కమిటీలు, మరోవైపు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల నియామకాలతో ఏదో ఓ పదవి వరిస్తుందని ఆశావహులు భావిస్తున్నారు. ఈమేరకు కొందరు తమ నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు నేరుగా ఇన్‌చార్జిల వద్దకు వెళ్లి తమ కష్టాన్ని వివరిస్తూ పాల్గొన్న కార్యక్రమాల ఫొటోలు, పత్రికల క్లిపింగ్‌లు అందిస్తున్నారు.

వర్గాల వారీగా పోటీ..

మండల పార్టీ అధ్యక్షులుగా, డీసీసీ కమిటీలో స్థానంతో పాటు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం ముఖ్య నేతల అనుచరులు వర్గాల వారీగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పదవులు దక్కించుకుని సత్తా చాటాలనుకునే నేతలు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మండల అధ్యక్ష పదవి దక్కాలంటే మూడేళ్ల నిర్విరామంగా పార్టీలో పనిచేయాలనే నిబంధన పెట్టారు. అయితే ఎన్నికల ముందు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలోని పలువురు ముఖ్యనేతలు, వారి అనుచరులు.. హస్తం గూటికి చేరారు. ఇలా కాంగ్రెస్‌లో చేరిన ముఖ్య నేతల అనుచరులు కూడా పదవులపై ఆశలు పెట్టుకున్నారు. కానీ అధిష్టానం నిబంధనతో ఎవరికి పదవులు దక్కుతాయన్న చర్చ మొదలైంది.

జనాభా ప్రకారం పదవులు కేటాయించాలి



సోమచంద్రశేఖర్, పిడమర్తి రవి ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న వంశీచంద్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవుల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, కాంగ్రెస్ నాయకుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కోరారు. ఖమ్మంలో శుక్రవారం వారు ఏఐసీసీ సెక్రటరీ చల్లా వంశీచంద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలైన సందర్భంగా పార్టీ, నామినేటెడ్ జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల్లో మూడింట రెండు వంతులు మాదిగలకు అవకాశం కల్పించడం ద్వారా గత 40ఏళ్లుగా జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వంశీచంద్‌రెడ్డి బదులిచ్చారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యకరం

- వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- సేంద్రియ మార్కెట్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: సేంద్రియ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం సొంతమవుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సమీకృత రైతు మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ మార్కెట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో తొలి సేంద్రియ మార్కెట్ ఇదే కాగా, కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రసాయనాలు, పురుగుమందుల స్థానంలో సహజ వనరులను ఉపయోగించి పండించే ఆహార ఉత్పత్తులను అందరికీ అంబాబాటులోకి తీసుకొచ్చేలా మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే ప్రజలకు సేంద్రియ ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా ఎరువులు, పురుగు మందులు తెలంగాణలోనే వినియోగిస్తున్నట్లు కేంద్రప్రభుత్వం గుర్తించినందున రైతులు వినియోగాన్ని తగ్గించేలా అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వీ.మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, కేఎంసీ ఈఈ కృష్ణలాల్, తహసీల్దార్ సైదులుతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

➡ **ఖమ్మం అర్బన్:** ఖమ్మం 55వ డివిజన్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షిస్తూ నాణ్యత తగ్గకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

➡ **ఖమ్మంమయూరిసెంటర్:** ఏఐసీసీ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జి చల్ల వంశీచందర్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో కలిశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచడమే లక్ష్యం

- 15 నాటికి యూనిఫామ్, పుస్తకాల పంపిణీ పూర్తి
- విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ అనుదీప్



డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ప్రతీ విద్యార్థి విద్యాప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ పనితీరు ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి విద్యాశాఖపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వం విద్యాశాఖకు పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తున్నందున సదుపాయాల కల్పన, ఫలితాల సాధనలో పురోగతి కనిపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 15నాటికి రెండేసి జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. తనిఖీ సమయాన ఎక్కడైనా విద్యార్థులు యూనిఫామ్‌తో లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మార్పుల కోసం ఈనెల 18నుంచి మండల స్థాయిలో క్యాంపులు నిర్వహించాలని సూచించారు. అలాగే, విద్యార్థుల హాజరు, పాఠశాలలు, భవిత సెంటర్లలో వసతుల కల్పన, బిల్లుల చెల్లింపు, విద్యాప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సూచనలు చేశారు. ఈసమావేశంలో డీఈఓ ఎస్.సత్యనారాయణ, సీఎంఓ రాజశేఖర్, ఆర్ అండ్ బీ ఈఈ పవార్ తదితరులు పాల్గొన్నారు.

67మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

ఖమ్మంగాంధీచౌక్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా పూర్తిచేశామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట, రేజర్ల, పినపాక గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కలెక్టరేట్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్ధిదారులకు 67ఇళ్లను కేటాయించామని తెలిపారు. దరఖాస్తుదారుల నుంచి యాతాలకుంటలో 40, రేజర్లలో 20, పినపాకలో ఏడుగురిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి నెరవేరడంపై సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

➡ **ఖమ్మంక్రైం:** ఉమ్మడి జిల్లా ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి రామోజీ రమేష్ శుక్రవారం కలెక్టర్ అనుదీప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు, సీఐలు శ్రీనివాసరావు, వై.వీ.ప్రసాద్, ఎస్ఐ హరిసింగ్, ఉద్యోగులు శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.

యూటీ వద్ద హైరానా..



లీకేజీ నీటితో నిండిన కాల్వ



యూటీ వద్ద మట్టితో వేసిన కట్టలు



గేట్ల నుంచి లీకేజీ అవుతున్న నీరు

- పాలేరు రిజర్వాయర్ ఔట్‌ఫాల్ గేట్ల లీకేజీతో కాల్వలోకి నీరు
- యుద్ధప్రాతిపదికన కట్టలు వేసి మళ్లింపు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ సమీపాన ఔట్‌ఫాల్ కెనాల్(ఎడమ కాల్వ) యూటీ గత ఏడాది వరదలతో కొట్టుకుపోగా కొత్త నిర్మాణం చేపడుతున్నారు. ఈమేరకు కాల్వను అడ్డంగా తవ్వి రెండు వైపులా మట్టితో కట్టలు వేసి పనులు చేపట్టారు. అయితే, పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరుతుండడంతో నీటి మట్టం పెరిగి ఔట్‌ఫాల్ కెనాల్ గేట్ల నుండి నీరు లీకేజీ అయి కాల్వలోకి చేరుతోంది. ఈమేరకు యూటీ వద్ద వేసిన అడ్డుకట్ట వరకు నిండడం, శుక్రవారం ఉదయానికి కాల్వ తెగిపోయే పరిస్థితి ఎదురుకావడంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. కాగా, యూటీ వద్ద కాల్వ అడుగు భాగం వరకు స్లాబ్ పూర్తయినందున అక్కడి నుంచి నీటిని మళ్లించేలా ఇరువైపులా మట్టి కట్టలు పోసి రోలింగ్ చేయించడమే కాక మట్టి కొట్టుకుపోకుండా పాలిథిన్ షీట్లు వేయించారు. ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం పనులు జరిగాయి. అయితే, ఔట్‌ఫాల్ కెనాల్ గేట్ల వద్ద లీకేజీల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని తెలుస్తోంది.

సాగర్ నుండి నిలిచిన నీటి సరఫరా

తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు రిజర్వాయర్‌కు గత ఆదివారం నుండి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శుక్రవారం సాయంత్రానికి రిజర్వాయర్ 19.40 అడుగులకు చేరింది. అయితే, గురువారం రాత్రి సాగర్ నుండి నీటి సరఫరా నిలిపివేసినా కాలువలో 1,500 క్యూసెక్కుల మేర నీరు ఉండడంతో అది చేరితే రిజర్వాయర్ శనివారం 20 అడుగులకు చేరనుంది.

పెన్షన్ల వడబోత

- బ్యాంకు లావాదేవీలు నెలలుగా జరగకపోతే పరిశీలన
- మృతుల గుర్తింపునకు క్షేత్రస్థాయిలో సర్వే
- అనర్హులను గుర్తించి తొలగింపునకు కసరత్తు

ఖమ్మంమయూరిసెంటర్: చేయూత పెన్షన్ల పంపిణీలో పారదర్శకత పెంచడంతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించేలా ప్రభుత్వం సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. తద్వారా అనర్హులను తొలగించి, అర్హులకు మంజూరు చేయాలనేది లక్ష్యంగా చెబుతున్నారు. ఈవిషయమై ఇటీవల ఖమ్మంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈమేరకు అనర్హుల గుర్తింపునకు చేయాల్సిన సర్వేపై సెర్ప్ డైరెక్టర్ సూచనలు చేశారు.

సామాజిక తనిఖీ ఆవశ్యకత

చేయూత పెన్షన్ పథకం కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు తదితరులకు నెలనెలా ఆర్థిక సాయం అందుతోంది. అయితే, కొందరు మృతి చెందినా జాబితా నుంచి తొలగించకపోగా.. ప్రభుత్వ ఉద్యోగులు, అధిక ఆదాయం ఉన్నవారు, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు సైతం పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించారు. తద్వారా అర్హులకు న్యాయం జరగడం లేదని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యాన సామాజిక తనిఖీ నిర్వహించడం ద్వారా అనర్హులకు ఏరివేతకు ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో కేటగిరీల వారీగా పింఛన్లు	
వృద్ధాప్య	70,532
వితంతు	70,526
దివ్యాంగులు	27,854
ఒంటరి మహిళలు	8,460
గీతకార్మికులు	3,146
హెచ్ఐవీ	2,539
ఫైలేరియా	1,382
చేనేత కార్మికులు	430
డయాలసిస్	285
బీడీ కార్మికులు	02

మృతులను గుర్తించేలా

వివిధ రకాల పెన్షన్లు పొందుతున్న జాబితాలో మృతుల వారి పేర్లు కూడా ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. గ్రామాల వారీగా పెన్షన్లు పొందుతున్న వారి వివరాలు సేకరించి, ప్రస్తుత స్థితిని తెలుసుకునేలా ఉద్యోగులు ఇంటింటి సర్వే చేయనున్నారు. అంతేకాక బ్యాంక్‌ల్లో పెన్షన్ జమ అవుతూ నెలల తరబడి డ్రా చేయని వారు వివరాలు సైతం సేకరించాలని నిర్ణయించారు. తద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

అధికారులే బాధ్యులు..

అనర్హులకు పింఛన్ అందినట్లు తేలితే అధికారులే బాధ్యత వహించాలని ప్రభుత్వం చెబుతోంది. ఈక్రమంలోనే అనర్హుల పేర్లు తొలగించే బాధ్యత తొలగించేందుకు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అప్పగించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కూడా బాధ్యులను చేయనున్నారు. సామాజిక తనిఖీల్లో అనర్హులకు గుర్తించి పేర్లు తొలగించని పక్షంలో సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యాన తనిఖీలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రజల సహకరిస్తేనే..

సామాజిక తనిఖీ విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని అధికారులు చెబుతున్నారు. ఎవరికి వారు తమ పరిధిలో అనర్హుల పేర్లను స్వచ్ఛందంగా వెల్లడించాలని కోరుతున్నారు. తద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని విస్తృత ప్రచారం చేయనున్నారు.

కాంగ్రెస్ పార్టీ.. బీసీల పక్షపాతి

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, పువ్వాళ్ల



సంబురాల్లో కేక్ తినిపించుకున్న వంశీచంద్, దుర్గాప్రసాద్, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలోనే తొలిసారి తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతిగా నిలిచిందని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వంశీచంద్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. రిజర్వేషన్ అమలుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చిన నేపథ్యాన శుక్రవారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం ఆధ్వర్యాన సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశాక వంశీచంద్‌రెడ్డి, దుర్గాప్రసాద్ మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని లక్ష్యంతో మంత్రివర్గ సమావేశంలో 42 శాతం అమలుకు నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, కార్పొరేటర్ రాపర్తి శరత్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, హరికనాయుడు, గజ్జెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జికి సన్మానం..



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంలీగల్: న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్‌ను శుక్రవారం పలువురు సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన జిల్లా జడ్జిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు విజయశాంత, ప్రధాన కార్యదర్శి దిలీప్‌తో పాటు నవీన్, శ్రీనివాసరావు, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులు కూడా ఆయనను సన్మానించారు.

రేపు రాష్ట్ర స్థాయి యోగా సదస్సు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలో ఈనెల 13న రాష్ట్ర స్థాయి యోగా సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మరికంటి వెంకట్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగే ఈ సదస్సుకు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. ఈ సందర్భంగా కేజీ నుంచి పీజీ వరకు యోగా విద్యను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని తీర్మానించనున్నామని తెలిపారు. ఈసమావేశంలో బి.వెంకట్, పంజాల ఐలయ్య, దామోదర్, సీహెచ్. కల్పన, జ్యోతి, ఎం.సృజన తదితరులు పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌కు ఇద్దరి అప్పగింత



మహిళలతో ఏసీపీ రెహమాన్, ఫౌండేషన్ బాధ్యులు

వైరా: మతిస్థిమితం కోల్పోయి రహదారుల వెంట తిరుగుతున్న ఇద్దరిని వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, ఎస్‌ఐ పి.రామారావు చేరదీసి మానవత్వాన్ని చాటుకున్నారు. వైరాలో తిరుగుతున్న వారిని శుక్రవారం గుర్తించగా, భోజనం పెట్టించి వివరాల సేకరణకు ప్రయత్నిస్తే భాష సమస్య ఎదురైంది. దీంతో ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా చైర్మన్ శ్రీనివాసరావు వచ్చి ఇద్దరు మహిళలను తమ ఫౌండేషన్‌కు తరలించారు.

మంత్రివర్గ నిర్ణయం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న ఎంపీ రేణుకాచౌదరి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రిజర్వేషన్ అమలుతో ఉద్యో గ, ఉపాధి అవకాశాల్లో బీసీలకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, నాగండ్ల దీపక్ చౌదరి పాల్గొన్నారు.

ఎంపీపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేస్తూ ఖమ్మం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి దేవినేని రాంప్రసాద్‌రావు శుక్రవారం తీర్పు చెప్పారు. 2014లో వైరా ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని ఆమె మోసం చేశారంటూ భూక్యా రాంజీ సతీమణి కళావతి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అనంతరం ఈ కేసు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానాన్ని బదిలీ అయింది. అయితే, విచారణలో నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఎంపీ తరఫున న్యాయవాదులు ఎం.నిరంజన్‌రెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి వాదించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,200	5,600
కందులు	6,000	5,900
మిర్చి	13,400	7,000
ఏసీ మిర్చి	13,500	8,000
మిర్చి తాలు	6,500	5,000
పత్తి	7,750	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఎరువు.. కృత్రిమ కరువు

- జిల్లా అంతటా యూరియాకు కటకట
- స్టాక్ ఉన్నా పక్కదారి పట్టిస్తున్న కొందరు డీలర్లు
- అమ్మకానికి ఇతర ఎరువులతో లింక్

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ సీజన్ ఇంకా ఊపందుకోకముందే అన్నదాతలకు ఎరువుల కష్టాలు మొదలయ్యాయి. ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వానాకాలం సీజన్‌లో సాధారణ పంటల సాగు 6,08,348 ఎకరాలు కాగా ఇప్పటివరకు 3లక్షలకు పైగా ఎకరాల్లో సాగయ్యాయి. పంటల సాగు దశలకు అనుగుణంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు యూరియా 54,825 మెట్రిక్ టన్నులు, డీఏపీ(డై అమోనియా పాస్ఫేట్) 17,466 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ(మ్యూరేట్ ఆఫ్ పొటాష్) 13,766 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 58,594 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ(సింగిల్ సూపర్ పాస్ఫేట్)4,484 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియాను వినియోగిస్తుండగా, చాలా చోట్ల నెలవారీ లక్ష్యం మేర కేటాయింపులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

యూరియాకు కటకట

జూలైలో 11,593 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో జూలై 5వ తేదీ నాటికి 7వేల మెట్రిక్ టన్నులు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 2,705 మెట్రిక్ టన్నులే వచ్చింది. యూరియా సరఫరా తక్కువగా ఉండటంతో సొసైటీల్లో పలుకుబడి ఉన్న వారే దక్కించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు ప్రైవేట్ మార్కెట్‌లో అధిక ధరలు ఉండటం, ఇతర ఎరువులకు లింక్ పెడుతుండడంతో సహకార సంఘాల్లో పైరవీలు పెరిగాయి.

డీలర్ల మాయాజాలం

ఎరువుల విక్రయాల్లో డీలర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఎరువుల కొరత పేరిట బ్లాక్ మార్కెట్‌కు తరలించేలా నిల్వ చేస్తున్నట్లు సమాచారం. ఎవరైనా యూరియా కోసం ఒత్తిడి చేస్తే డీఏపీ లేదా కాంప్లెక్స్ ఎరువు కొనాలని చెబుతున్నట్లు తెలిసింది. అంతేకాక 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266.50 ఉండగా ప్రాంతాన్ని వారీగా రూ.320 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు డీఏపీ లేదా కాంప్లెక్స్ ఎరువుల బస్తా కొనాల్సి వస్తుండడంతో రైతులు అదనంగా రూ.1,350 పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది.

ఇబ్బందులు రాకుండా పర్యవేక్షణ



ప్రస్తుతం మార్క్‌ఫెడ్, డీలర్లు, సొసైటీలు వద్ద 10,110 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. నానో యూరియా కూడా అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యూరియా కొరత రాకుండా పర్యవేక్షిస్తూనే డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా తనిఖీలు చేస్తున్నాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

బయట నో స్టాక్.. లోపల స్టాక్

సత్తుపల్లి: 'ఎరువులకు కొరతలేదు.. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.. ఏది కావాలంటే అదే ఇవ్వాలి తప్ప ఇతర ఎరువులను లింక్ పెట్టొద్దు' అని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సత్తుపల్లిలో తనిఖీ సందర్భంగా డీలర్లను హెచ్చరించి 48 గంటలు కూడా గడవలేదు. కానీ డీలర్లు ఎప్పటిలాగే రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. యూరియా, పొటాష్ నిల్వలు ఉన్నా లేవంటూ తిప్పి పంపిస్తుండడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈక్రమంలో స్థానిక రైతు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి శుక్రవారం ఓ షాప్‌లో ఆరా తీయగా స్టాక్ లేదని సమాధానం ఇవ్వడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఓ శ్రీనివాసరావు తనిఖీ చేయగా సత్తుపల్లిలోని దేవి ఎంటర్‌ప్రైజెస్‌లో 150 బస్తాలు, రైతు ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేయగా, దేవి ఎంటర్‌ప్రైజెస్‌లో 48 బస్తాలు ఎంఓపీ నిల్వలు బయటపడడం గమనార్హం.



దేవీ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాసరావు

ధరలు పెరుగుతాయని..

యూరియా, ఎంఓపీ(మ్యూరేట్ ఆఫ్ పొటాష్)కు రైతుల నుంచి డిమాండ్ ఉంది. యూరియా, ఎంఓపీ ధరలను త్వరలోనే పెంచనున్నట్లు తెలిసింది. ఇదే అదునుగా డీలర్లు ఉన్న స్టాక్‌ను బ్లాక్ చేస్తున్నారని సమాచారం. అంతేకాక కొందరు డీలర్లు కాంప్లెక్స్ ఎరువు తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెపుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సత్తుపల్లి ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం స్టాక్ ఉన్న మేర ఎరువులు విక్రయించాలని సూచించారు. ధర పెంచినా, ఇతర ఎరువులతో లింక్ చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించేలా కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలు ప్రతీ సబ్జెక్ట్‌లో మెరుగుపడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల హెచ్ఎంలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. సబ్జెక్ట్ టీచర్లు ఉద్దీపకం వర్క్ బుక్‌ల ద్వారా విద్యార్థులకు బోధన సాగించాలని తెలిపారు. పాఠశాలలకు సరఫరా చేసిన నోటుబుక్స్, టెక్ట్స్ బుక్స్, యూనిఫామ్‌లు వెంటనే అందించాలని, నూతన మెనూ ప్రకారం భోజనం సమకూర్చాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యాన పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆర్ఓ ప్లాంట్లు లేనిచోట వేడి చేసిన నీటినే విద్యార్థులకు అందించాలని పీఓ సూచించారు. సమావేశంలో డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏసీఎంఓలు రాములు, రమేశ్, ఏటీడీఓలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో రన్నరప్‌గా జిల్లా జట్టు



రన్నరప్ ట్రోఫీతో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో నిజామాబాద్ జట్టుతో తలపడగా, హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా, జట్టు నుంచి శ్వేత ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైంది. ఈమేరకు క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్‌తో పాటు రమణ, కిషోర్, కోచ్‌లు నోయల్ జాక్సన్, మాధురి అభినందించారు.

రవాణా శాఖలో వసూళ్ల దందా..

- ఏ పనికైనా ఏజెంట్లే సూత్రధారులు
- సత్తుపల్లి కార్యాలయ ఉద్యోగులపై రైతులు, వాహనదారుల విమర్శలు



సత్తుపల్లి ఎంవీఐ కార్యాలయం

సత్తుపల్లి: రాష్ట్రంలోని పలుచోట్ల రవాణా శాఖ కార్యాలయాలపై ఏసీబీ దాడులు జరుగుతున్నా సత్తుపల్లిలో మాత్రం అధికారుల తీరు మారడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సత్తుపల్లి రవాణా శాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా వచ్చే పనులే చేస్తూ నేరుగా వచ్చే వాహనదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారని తెలుస్తోంది. గతంలో ఈ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీ చేయగా ఓ జూనియర్ అసిస్టెంట్ పట్టుబడ్డాడు. అయినా తీరు మారకపోవడం గమనార్హం.

తనిఖీల్లో వసూళ్ల పర్వం

వాహనాల తనిఖీ సందర్భంగా ఎంవీఐ ప్రైవేట్ సైన్యాన్ని నియమించుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. పత్రాల్లో ఏ మాత్రం తేడా ఉన్నా కాసులు సమర్పించాల్సి వస్తోందని వాపోతున్నారు. సత్తుపల్లి నియోజకవర్గం ఏపీకి సరిహద్దుగా ఉండడంతో రెండు రాష్ట్రాల వాహనాలు అటూఇటు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈక్రమంలోనే పర్మిట్ల పేరిట పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారనే విమర్శ వస్తుంది. ఇక రవాణా శాఖ కార్యాలయానికి ఏ పనిపై వెళ్లినా ఏజెంట్లను ఆశ్రయిస్తే సులువుగా పూర్తవుతుందనే ప్రచారం జరుగుతోంది. అదే వాహనదారులు సొంతంగా వెళ్తే రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు.

రైతుల ట్రాక్టర్లనూ వదలకుండా..

వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పట్టణాలకు వెళ్లివస్తున్నారు. ఈక్రమంలోనే రైతులను బెదిరిస్తున్న రవాణా శాఖ ఉద్యోగులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కొందరు ప్రజాప్రతినిధులను ఆశ్రయించినట్లు సమాచారం. పన్నులు, ఇతర పేర్లతో రైతులను ఇబ్బంది పెడుతున్న ఎంవీఐపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్ ట్యాక్స్ కట్టకపోతే జరిమానా

వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్తున్న ట్రాక్టర్లపై ఎప్పుడు కేసులు రాయలేదు. రోడ్డు ట్యాక్స్ కట్టని వాటిపైనే కేసు నమోదు చేసి జరిమానా విధించాం. మా కార్యాలయంలో ఏజెంట్ల వ్యవస్థ అసలే లేదు. కొందరు చేస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలే.

– శ్రీనివాసరావు, ఎంవీఐ, సత్తుపల్లి

జనాభా నియంత్రణ అవసరం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా నియంత్రణ తప్పనిసరని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించగా ఆమె మాట్లాడారు. జనాభా పెరుగుదలతో ఎదురయ్యే నష్టాలను వివరించడమే కాక కుటుంబ నియంత్రణ పాటించేలా దంపతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జనాభా నియంత్రణతోనే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు వెంకటరమణ, చందునాయక్, బిందుశ్రీ, ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, నవీన్‌కుమార్, సాంబశివారెడ్డి, దుర్గ, నాగరాజ్, కృష్ణచైతన్య, రాజేశ్వరిదేవి, అన్వర్, శారద, వేణుమాధవ్, ప్రగతి పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించిన ఉద్యోగులు బి.మాధవి, ఎం.హైమావతి, డాక్టర్ అలివేలు, ఎస్.లక్ష్మి, కృష్ణమోహన్, రాజేష్, బి.ఆదిలక్ష్మికి డీఎంహెచ్ఓ కళావతి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలు

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: భారత రాజ్యాంగానికి మూలస్తంభాలుగా నిలుస్తున్న సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయ వ్యాఖ్యానించడం దేశ ప్రజలందరినీ అవమానించినట్లేనని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో రాజ్యాంగం రద్దుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయనే అనుమానాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన సంఘం ఉమ్మడి జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను లేకుండా చేసి మత రాజ్యాంగం అమల్లోకి తీసుకురావాలని పాలకులు కుట్ర పన్నారని ఆరోపించారు. గోరక్షక దళాలు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్థిక దోపిడీ మూలాలు అంశంపై బండారు రమేష్ మాట్లాడగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపాటి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల భారతితో పాటు బండి రమేష్, పాపిట్ల సత్యనారాయణ, కొమ్ము శ్రీను, కర్లకుంట నరేష్, మాచర్ల గోపాల్, ఎస్.కే.సైదులు, నోముల పుల్లయ్య, కె.సర్వేశ్వరరావు, నందిపాటి రమేష్, మన్నెం మోహన్‌రావు పాల్గొన్నారు.

జిల్లా మీదుగా 'భారత్ గౌరవ్' ప్రత్యేక రైలు

ఈనెల 19నుంచి 26వ తేదీ వరకు టూర్



యాత్ర బ్రోచర్లు విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేలా ఏర్పాటుచేసిన 'భారత్ గౌరవ్' ప్రత్యేక రైలు జిల్లా మీదుగా ప్రయాణం సాగిస్తుందని ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ పీ.వీ.వెంకటేష్ తెలిపారు. ఖమ్మం శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న మొదలయ్యే హైదరాబాద్‌లో యాత్ర 26వ తేదీ వరకు సాగుతుందని వెల్లడించారు. యాత్రలో భాగంగా తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర క్షేత్రాల సందర్శన ఉంటుందని, సాధారణ బోగీలో రూ.14,100, థర్డ్ ఏసీలో రూ.22,300, సెకండ్ ఏసీలో రూ.29,200గా టికెట్ ధర నిర్ణయించామని తెలిపారు. ఈ రైలుకు జిల్లాలోని ఖమ్మం, మధిరలో హాల్టింగ్ ఉన్నందున జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టికెట్ల బుకింగ్, ఇతర వివరాల కోసం 97013 60701, 92814 95845, 92814 95843 , 92810 30749 నంబర్లలో సంప్రదించాలని వెంకటేష్ సూచించారు. ఈ సమావేశంలో ఉద్యోగులు ఎం.శ్రీకాంత్, కె.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు .

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో జరిగే వనమహోత్సవంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటుతారు. ఆతర్వాత రఘునాథపాలెం మండలం కేవీ బంజర రోడ్డులో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కొణిజర్ల మండలం అంజనాపురంలో జరిగే ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పాల్గొని, రైతులతో సమావేశమవుతారు.

పంట చేనులోనే పోయిన ప్రాణం

విద్యుదాఘాతంతో రైతు మృతి



రైతు చల్లగుండ్ల నాగార్జున మృతదేహం

వేంసూరు: వానాకాలం సాగు పనులకు ఉపక్రమించిన రైతు పొలాన్ని సిద్ధం చేసే క్రమాన విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. వేంసూరు మండలం చౌడవరం తండా సమీపాన శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. వేంసూరు కమ్మబజార్‌కు చెందిన చల్లగుండ్ల నాగార్జున(55) శుక్రవారం ఉదయం చౌడవరం తండా సమీపంలో పొలంలో దుక్కి దున్నించేందుకు వెళ్లాడు. అయితే, మధ్యలో విద్యుత్ తీగ అడ్డుగా ఉందని తొలగించే క్రమాన షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు నాగార్జునకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రెండు రోజుల క్రితం వేంసూరు కమ్మబజార్‌కు చెందిన రావి నాగేశ్వరరావు మృతి చెందగా, ప్రస్తుతం నాగార్జున మృతితో స్థానికంగా విషాదం అలుముకుంది.

భర్త వేధింపులు తట్టుకోలేక మహిళ ఆత్మహత్య



తేజావత్ మౌనిక (ఫైల్)


కామేపల్లి: అనుమానంతో భర్త వేధిస్తుండడాన్ని తట్టుకోలేక ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని బాసిత్‌నగర్‌కు చెందిన తేజావత్ మౌనిక వివాహం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన సపావట్ కృష్ణప్రసాద్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన కృష్ణప్రసాద్ మౌనికను అనుమానిస్తుండడంతో కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు మూడేండ్ల కుమారుడు ఉన్నాడు. మౌనిక తండ్రి వీరన్న ఫిర్యాదుతో ఆమె భర్త, అత్త, ఆడబిడ్డపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి దూరం పెడుతోందని..

చింతకాని: ప్రేమించిన యువతి కొన్నాళ్లుగా మాట్లాడడం లేదని పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొణిజర్ల మండలం కొండవనమాలకు చెందిన హరికొట్ల శ్రీను(24) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా, ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆమె కొద్దిరోజులుగామాట్లాడకపోవటంతో ఆయన ఈనెల 9వ తేదీ రాత్రి చింతకాని మండలం కొదుమూరు సమీపాన పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బందికి చెప్పగా వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా, శ్రీను తండ్రి నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

కూసుమంచి ఏడీఏ సరితకు పదోన్నతి


భద్రాద్రి జిల్లా ఆత్మ డీపీడీగా నియామకం



బి.సరిత

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: కూసుమంచి వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) బి.సరితకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డీపీడీ)గా నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం సరిత విధుల నుంచి రిలీవ్ అయి భద్రాద్రి జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయాన ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ ఎం.సతీశ్‌కు కూసుమంచి ఏడీఏగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, సరిత సుదీర్ఘకాలం ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏడీఏగానే కాక ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి నగదు అందిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వైరా మండలం పుణ్యపురికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని చెరుకూరి నివేదిత చదువు కోసం ఖమ్మం లయన్స్ క్లబ్ బాధ్యులు శుక్రవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.జగదీష్‌బాబు, ఎం.దుర్గానాగేశ్వరరావుతో పాటు కృష్ణమూర్తి, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, డీపీసీ.రావు, హనుమంతరావు, కృష్ణమూర్తి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యాన ఇంజనీర్ల దినోత్సవంలో భాగంగా సీనియర్ ఇంజనీర్లు వేముల హన్మంతరావు, కొల్లూరి కృష్ణమూర్తిని సన్మానించారు.

మూడు ఇళ్లలో చొరబడిన దొంగలు

మధిర: ఒకేరోజు రాత్రి మూడు ఇళ్లలో దుండగులు చోరీకి యత్నించగా ఒక స్కూటీ ఎత్తుకెళ్లారు. మధిర మున్సిపల్ పరిధి అంబారుపేటకు చెందిన కర్నాటి కోటి, మణిభూషణం కుటుంబాలు వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాయి. దీంతో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇళ్ల తాళాలు పగలగొట్టినా విలువైన వస్తువులేమీ లభించక బీరువాల్లో దుస్తులను చిందరవందర చేసి వెళ్లిపోయారని సమాచారం. సమీపంలోని కర్నాటి పెద్దబుజ్జి ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట నిలిపిన స్కూటీని ఎత్తుకెళ్లారు.